## అంగన్‌వాడీ టీచర్ హత్య
### ములుగు జిల్లాలో ఘటన

తాడ్వాయి, మే 15: అంగన్‌వాడీ టీచర్ హత్యకు గురయ్యారు. ఈ ఘటన ములుగు జిల్లాలో బుధవారం వెలుగు చూసింది. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన రడం సుజాత (48) తాడ్వాయి మండ లం కాటాపురం అంగన్‌వాడీ సెంటర్-3లో టీచర్‌గా పని చేస్తున్నారు. మంగళవారం స్వగ్రామం నుంచి కాటాపురానికి చేరుకున్న ఆమె విధులు ముగించుకున్న అనంతరం మధ్యా హ్నం 1.30 గంటలకు ఇంటికి వెళ్లేందుకు బస్టాప్‌కు వచ్చారు. బస్సు వెళ్లి పోవడంతో గుర్తుతెలియని వాహనం ఎక్కారు. బుధవారం ఉదయం కాటాపూ ర్-తాడ్వాయి రహదారి మధ్యలో నీళ్ల ఒర్రెకు అర కిలోమీటర్ దూరంలో తుని కాకు కోసేందుకు వెళ్లిన కూలీలకు ఓ మహిళ మృతదేహం కనిపించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందిం చడంతో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, పస్రా సీఐ శంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌ను తీసుకువచ్చి మృతదేహాన్ని పరిశీ లించారు. మృతురాలి మెడకు స్కార్ఫ్ చుట్టి ఉండటంతోపాటు తల వెనుక పెద్ద గాయమైంది. హత్యకు గురైంది సుజా తగా గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి ఒంటిపై ఉన్న నాలుగు తులాల బంగారం తోపాటు సెల్‌ఫోన్ చోరీకి గురయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సుజాత కాటాపురం గ్రా మంలో ఎవరి వాహనం ఎక్కి వెళ్లిందనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు.

దగ్ధమవుతున్న కారు

సూర్యనారాయణ, రుక్మిణి (ఫైల్)

## చెట్టును ఢీకొన్న కారు వృద్ధ దంపతుల దుర్మరణం

- మరో ఇద్దరిని కాపాడిన 108 సిబ్బంది

బోనకల్లు, మే 15 : వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో వృద్ధ దంపతులు మృతిచెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ ఘటన ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ముష్టికుంట్ల సమీపంలో బుధ వారం చోటుచేసుకున్నది. ఖమ్మం నగ రంలోని మామిళ్లగూడేనికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ కొత్తూరు సూర్యనారాయణ (92), ఆయన భార్య రుక్మిణి (85), మనుమడు అనిల్, వృద్ధ దంపతులకు కేర్ టేకర్‌గా పనిచేస్తున్న నాగరాజు కలిసి కారులో మధిర నుంచి ఖమ్మం వెళ్తు న్నారు. అనిల్ కారు నడుపుతున్నాడు. ముష్టికుంట్ల సమీపంలో అదుపుతప్పిన కారు చెట్టుకు ఢీకొట్టింది. దీంతో ఒక్కసా రిగా కారులో నుంచి మంటలు చెలరే గాయి. అదే సమయంలో ఖమ్మం నుంచి మధిర వైపు వెళ్తున్న 108 సిబ్బంది గమ నించి ఆగారు. కారు అద్దాలు పగులగొట్టి కారులో ఉన్న వృద్ధ దంపతులు సూర్య నారాయణ, రుక్మిణిని బయటకు తీయగా.. అప్పటికే వారిద్దరూ మృతిచెం దారు. అనిల్ స్పృహ కోల్పోగా.. నాగరా జుకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో మంటలు ఎగిసిపడుతున్నా స్థానికులు, 108 సిబ్బంది ప్రాణాలకు తెగించి అనిల్, నాగరాజును బయటకు తీశారు. 108 వాహనంలో ఖమ్మం దవాఖానకు తరలించారు. కారు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఇద్దరి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని స్థానికులు అభినందిం చారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్టు మధిర సీఐ మధు తెలిపారు.

# మట్టిపోసి.. రోడ్డు వేసి.. చెరువుకు స్కెచ్!

- 20 ఎకరాల సుంతరోని చెరువుపై కన్నేసిన అక్రమార్కులు
- రాత్రివేళల్లో మట్టి పోసి పూడుస్తున్నవైనం
- కండ్ల ముందు తతంగంపై అధికారుల మౌనం

శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సుంతరోని చెరువు మధ్యలో మట్టిపోసి రోడ్డుగా మార్చుకున్న అక్రమార్కులు

శంషాబాద్ రూరల్, మే 15: ఒకరోజు రాత్రి మట్టి పోస్తారు.. మరో రోజు రాత్రి చదును చేస్తారు.. కొన్నాళ్ల తర్వాత దానిపై దుకాణాలు తెరుస్తారు.. అంతా ఓ ప్రణాళిక ప్రకారం జరుగుతుంది. ఇదేదో అభివృద్ధి కార్య క్రమం కాదు.. అధికార యంత్రాంగం కండ్ల ముందే ఇరవై ఎకరాల చెరువు గొంతు నులిపే కబ్జా కథ. అటు రెవెన్యూ.. ఇటు ఇరిగేషన్ అధి కారులు నోరు మెదపరు.. ప్రజాప్రతినిధులే వెనుక ఉండి ప్రోత్సహిస్తున్న ఆక్రమణప ర్వంతో శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామ పరిధిలో ఉన్న సుంతరోని చెరువు కాల గర్భంలో కలిసే ప్రమాదం పొంచి ఉన్నది.

శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సుంతరోని చెరువు సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఎగు వన పెద్ద షాపూర్, ఘాంసీయాగూడ, చౌదరి గూడ చెరువులకు అనుసంధానంగా ఉన్న ఈ గొలుసుకట్టు చెరువు హిమాయత్‌సాగర్‌కు అతి సమీపంలో ఉంటుంది. చెరువు నీటితో కళకళ లాడుతుండడంతో భూగర్భజలాలు సమృద్ధిగా ఉన్నాయి. ఈ చెరువు సమీపంలో కొంతభూ మిని కోనుగోలు చేసిన కొందరు మొదట దేవా లయం నిర్మించారు. నెమ్మదిగా ఈ చెరువును మట్టితో పూడ్చి.. దేవాలయానికి వచ్చే భక్తులకు మూత్రశాలలు, దుకాణాల సముదాయం, రోడ్డు పేరుతో దాదాపు 20 గుంటలకుపైగా చెరువును కబ్జా చేసి నిర్మాణాలు పూర్తి చేశారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో మరో అడుగు ముందుకేశారు. కొంతకాలంగా రాత్రివేళల్లో మట్టి తెచ్చి నెమ్మదిగా చెరువును మళ్లీ పూడ్చటం మొదలుపెట్టారు. ఇలా చెరువు మధ్యలోనే ఏకంగా ఒక కట్టలా మట్టిని పోసి... రోడ్డును ఏర్పాటు చేశారు. దీని ద్వారా క్రమంగా చెరువులో నీళ్లు పోయి ఒట్టిపోతుంద నేది అక్రమార్కుల వ్యూహంగా కనిపిస్తుంది. పైగా చెరువులో నీళ్లు నిల్వ ఉండకుండా చెరువు కట్టను కూడా ధ్వంసం చేశారు. నాలుగు రోజుల నుంచి రాత్రి సమయంలో మట్టిని తీసుకు వచ్చి చెరువులో నింపుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోక పోవడం లేదు. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం : దుద్యా నాయక్, ఇరిగేషన్ డీఈ

సుంతరోని చెరువు కబ్జాపై 'నమస్తే తెలంగాణ' ఇరిగేషన్ శాఖ డీఈ దుద్యా నాయక్‌ను సంప్రదించగా.. చెరువును కబ్జా చేస్తున్నట్టుగా సమాచారం వచ్చిం దని, ఆ ఫిర్యాదుపై పరిశీలన చేసి కబ్జాదా రులపై చర్యలు తీసుకుంటామని తెలి పారు. తహసీల్దార్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

## మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- ఉపాధి కరువై.. ఆర్థిక సమస్యలు భారమై గజ్వేల్‌లో చెట్టుకు ఉరేసుకున్న స్వామి
- ఉచిత బస్సు ప్రయాణం ఎఫెక్ట్

పసుల స్వామి (ఫైల్)

గజ్వేల్, మే 15 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభావంతో ఉపాధి కరువై మరో ఆటో డ్రైవర్ ప్రాణాలు తీసు కున్నాడు. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం వెలు గుచూసింది. గజ్వేల్‌లోని మధురానగర్‌కు చెందిన పసుల స్వామి (33) గతంలో కారు డ్రైవర్‌గా జీవనం సాగించాడు. ప్రమా దవశాత్తు జరిగిన ప్రమాదంలో కాలు విర గడంతో కొద్దిరోజులపాటు ఇంటి వద్దే ఉన్నాడు. కుటుంబం గడిచే పరిస్థితి లేకపో వడంతో ఏడాదిన్నర క్రితం ఆటోను కొను క్కుని సొంతంగా నడుపుతున్నాడు.అప్పటి వరకు ఎలాంటి సమస్యలు లేకుండా జీవనం సాగిన ఆ కుటుంబంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళ లకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో కష్టాలు మొదల య్యాయి. గిరాకీ లేక ఆటో నడవక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. తీవ్రంగా కలత చెందిన స్వామి మంగళవారం రాత్రి ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయం మున్సిపల్ పరిధిలోని రాజిరెడ్డిపల్లి సమీ పంలో చెట్టుకు ఉరేసుకుని విగత జీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరి శీలించి శవ పంచనామా పూర్తిచేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ దవాఖానకు తరలించారు. స్వామికి భార్యతోపాటు ముగ్గురు సంతానం ఉన్నారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ గంగిశెట్టి చందన రవీందర్ తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

## యువకుడి ప్రాణం తీసిన కుయుక్తి

- మలుపు తిరిగిన డబ్బు స్వాధీన ఘటన
- 6.7 లక్షలు నొక్కేసేందుకు ఖాకీల యత్నం
- కీసరలో ఇద్దరు పోలీసులపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 15 (న మస్తే తెలంగాణ): 'ఓ చోట నుంచి డబ్బులు వస్తాయి. ఆ సమాచారాన్ని మీకు అందజేస్తాను. పట్టుకున్న డబ్బును మనం పంచుకుందాం' అంటూ రంజిత్ అనే యువకుడు ఇద్దరు పోలీసులతో కలిసి వేసిన ప్లాన్ తిరగబడింది. దీంతో ఆ సమా చారం ఇచ్చిన రంజిత్ మరుసటి రోజే అను మానాస్పద స్థితిలో మృతి చెందగా.. అతని నుంచి సమాచారం తీసుకొని డబ్బులు నొక్కేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు కాని స్టేబుళ్లు సస్పెండయ్యారు. వివరాల్లోకెళ్తే.. ఎన్నికల్లో నగదు ప్రవాహాన్ని అడ్డుకోవ డంలో భాగంగా కీసర పోలీస్ స్టేషన్ మొబైల్ టీమ్‌కు చెందిన కానిస్టేబుల్ శ్రీకాంత్‌యాదవ్, హోంగార్డు రాజు ఈ నెల 11న ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో కరీంగూడ చౌరస్తా వద్ద విధులు నిర్వహిస్తున్నారు. రంజిత్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆ సమయంలో పల్సర్ బైక్‌పై వెళ్తున్న సాయి కుమార్, కార్తీక్‌ను పట్టుకొని రూ.25 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆ సొమ్ము నుంచి దాదాపు రూ.6.7 లక్షలు పక్కకు తీసి రూ.18.3 లక్షలు స్వాధీనం చేసుకు న్నట్టు ఉన్నతాధికారులకు సమాచారమి చ్చారు. దీంతో తమ వద్ద నుంచి రూ.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు బైక్‌పై వచ్చిన ఇద్దరిలో ఓ యువకుడు కీసర ఇన్ స్పెక్టర్‌కు వివరించాడు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో శ్రీకాం త్‌యాదవ్, రాజును సస్పెండ్ చేశారు. అనంతరం రంజిత్ గురించి ఆరా తీయ డంతో.. అతను సాయికుమార్, కార్తీక్‌తో కలిసి చంగిచర్ల ప్రాంతంలోని బంధువుల బార్‌లో పనిచేస్తున్నట్టు తేలింది. ఆ బార్ యజమానికి సంబంధించిన సొమ్మునే పోలీసులు పట్టుకున్నట్టు వెల్లడైంది. దీంతో ఆందోళనకు గురైన రంజిత్ ఈ నెల 12న మేడిపల్లిలోని తన ఇంట్లో ఉరేసుకొని అను మానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీ సులు.. పోస్టుమార్టం అనంతరం రంజిత్ మృతదేహాన్ని కుటుంబంసభ్యులకు అప్ప గించారు.

## జూలై 15కు కృష్ణా ట్రిబ్యునల్ విచారణ వాయిదా

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలం గాణ): తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ జూలై 15, 16 తేదీలకు వాయిదా పడింది. ఉమ్మడి ఏపీకి కృష్ణాజ లాల్లో కేటాయించిన 1,005 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీ లను తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య పునః పంపిణీ, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయిం పునకు కేంద్రం గత అక్టోబర్‌లో నూతన మార్గదర్శకాలు జారీచేసిన సంగతి తెలిసిందే. ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా ట్రిబ్యు నల్ విచారణ ప్రారంభించింది. ఇటీవలే రెండు రాష్ట్రాలు ట్రిబ్యునల్‌లో విచారణ అంశాలపై స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ) దాఖలు చేశాయి. వాటిపై బుధవారం ఢిల్లీలో విచారణ కొనసాగింది. అయితే ఎస్‌వోసీలపై కౌంటర్ అఫిడవిట్, స్టేట్‌మెంట్లను దాఖలు చేసేందుకు 4 వారాల గడువు కావాలని ఏపీ, 2వారాల గడువు కావాలని తెలంగాణ విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో విచారణను జూలై 15, 16కు ట్రిబ్యునల్ చైర్మన్, జస్టిస్ బ్రిజేశ్ కుమార్ వాయిదా వేశారు. అయితే జూలై 8లోగా విచారణ అంశాల డ్రాఫ్ట్‌ను దాఖలు చేయాలని ఇరు రాష్ట్రాలకు సూచించారు.

## యూకే పార్లమెంట్ బరిలో కరీంనగర్ బిడ్డ

- శనిగరానికి చెందిన ఉదయ్‌ను అభ్యర్థిగా ప్రకటించిన లేబర్ పార్టీ
- నార్త్‌బెడ్ ఫోర్డ్ షైర్ నుంచి బరిలోకి

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలం గాణ): బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో లేబర్ పార్టీ తరపున తెలంగాణ బిడ్డ బరిలోకి దిగు తున్నాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఉద య్‌నాగరాజు 'నార్త్ బెడ్ ఫోర్డ్ షైర్' నుంచి పార్లమెంటరీ అభ్యర్థిగా బరిలోకి దిగుతు న్నట్టు పార్టీ ప్రకటించింది. బౌండరీ కమిషన్ సిఫారసుల మేరకు బ్రిటన్‌లో కొత్తగా ఈ నియోజకవర్గం ఏర్పడింది. ప్రఖ్యాత సర్వే సంస్థ ఎలక్టోరల్ కాల్కులస్ ప్రకారం నియో జకవర్గంలో 68 శాతం లేబర్‌పార్టీ సొంతం కాబోతున్నదని అంచనా వేసింది. బ్రిటన్‌లో నూ ఎన్నికల కోలాహలం నెలకొన్నది. ఇదే ఏడాది అమెరికాలోనూ ఎన్నికలు జరగను న్నాయి. రష్యా-ఉక్రెయిన్ యు ద్ధం, ఇజ్రా యిల్-పాలస్తీనా ఘర్షణ, ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం ప్రమాదం పొంచి ఉన్న నేప థ్యంలో బ్రిటన్, అమెరికా ఎన్నికలపై ప్రపం చవ్యాప్తంగా ఆసక్తినెలకొన్నది.

**అంచెలంచెలుగా ఎదిగిన ఉదయ్**

సామాన్య మధ్య తరగతి కుటుంబంలో ఉదయ్‌నాగరాజు జన్మించారు. హన్మంత రావు, నిర్మలాదర్ ఆయన తల్లిదం డ్రులు. ప్రపంచ ప్రఖ్యాత యూని వర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్‌లో పాలనా శాస్త్రంలో ఉదయ్ పీజీ చేశారు. సమాజం, భావితరా లపై ఆర్టిఫిషిల్ ఇంటలిజెన్స్ ప్రభావాన్ని ముందుగానే పసిగట్టిన ఆయన ఏఐ పాలన్ లాబ్స్ అనే థింక్-ట్యాంక్‌ని నెలకొల్పారు. అంతర్జాతీయ వక్తగా, రచయితగా ఉదయ్ మంచి పేరు తెచ్చుకున్నారు. క్షేత్రస్థాయి సమ స్యలపై ఆయనకు మంచి పట్టు ఉన్నది. స్కూల్ గవర్నర్‌గా, వలంటీర్‌గా, విస్తృత రాజకీయ ప్రచారకుడిగా పేరుంది. దశాబ్దం ఇంటింటి ప్రచారంతో సామాన్యుల కష్టాలపై అవగాహన సాధించారు. ఈ ఎన్నికల్లో లేబర్ పార్టీ అఖండ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవాకాశాలున్నాయని సర్వే సంస్థలు తేల్చాయి. ఈ నెలలో జరిగిన కౌన్సి లర్, స్టేట్స్ మేయర్ ఎన్నికల్లోనూ లేబర్ పార్టీ ఘనవిజయం సాధించింది. దీంతో ఉదయ్ బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఘన విజయం సాధించడం ఖాయంగా కనిపిస్తు న్నది. పార్లమెంటరీ అభ్యర్థిగా పోటీ చేయ నున్న ఉదయ్‌నాగరాజుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలిపారు.

### జూన్ 10లోగా మేడిగడ్డ పనులు నిర్వహించాలి

- ఇరిగేషన్‌శాఖకు జ్యుడీషియరీ కమిషన్ ఆదేశం
- ఇప్పటికే ఏజెన్సీతో ఉన్నతాధికారుల సమావేశం

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల రక్షణకు తీసుకోవా ల్సిన చర్యలపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ చేసిన మార్గదర్శకాలను జూన్10లోగా అమలు చేయాలని ఇరి గేషన్‌శాఖ ఉన్నతాధికారులకు కాళే శ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన జ్యుడిషి యరీ ఎంక్వయిరీ కమిషన్ స్పష్టం చేసింది. వర్షాకాలంలో బరాజ్‌ల రక్ష ణకు చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్‌శాఖ ఉన్నతా ధికారులు బరాజ్‌ల నిర్మాణ ఏజెన్సీ లతో సమావేశమయ్యారు. ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ మార్గదర్శకాల మేరకు చేపట్టాల్సిన పనులపై చర్చిం చారు. జాప్యం లేకుండా పనులు చేప ట్టాలని ఆయా ఏజెన్సీలను కోరినట్టు సమాచారం.

## సైబర్ దోపిడీ ముఠాల వెయ్యి ఐడీలు బ్లాక్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్ ఇతర నిషేధిత వస్తువులు స్మగ్లింగ్ చేస్తున్నారంటూ బెదిరించి, డిజిటల్ లాక్ చేసి సైబర్ దోపిడీలకు పాల్పడుతున్న ముఠాలకు సంబంధించిన 1,000 స్కైప్ ఐడీలను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేయించింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఎప్పటికప్పుడు ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) అప్రమత్తంగా ఉంటుంది. 1930కు బాధితులు ఫిర్యాదు చేయడంతో ఐ4సీ ఆ వివరాలను విశ్లేషిస్తుంది. ఆయా రాష్ట్రాల్లోని సైబర్ క్రైమ్ విభాగాల నివేదికలు, బాధితుల నుంచి వచ్చే వివరాలతో ఎప్పటికప్పుడు సైబర్‌నేరాల అదుపునకు చర్యలు తీసుకుంటున్నది. ఇందులో పోలీసులమని చెబుతూ డిజిటల్ లాక్ చేస్తూ, అమాయకులను డిజిటల్ అరెస్ట్ చేస్తున్న క్రిమినల్స్ వాడుతున్న స్కైప్ ఐడీలను గుర్తించి మైక్రోసాఫ్ట్‌నకు నివేదిక ఇవ్వడంతో వెయ్యి స్కైప్ ఐడీలను బ్లాక్ చేసింది.

## డ్రైవర్ కమ్ కండక్టర్ పోస్టుల భర్తీ?

- నోటిఫికేషన్ విడుదలకు టీఎస్ఆర్టీసీ కసరత్తు

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): టీఎస్ఆర్టీసీని డ్రైవర్లు, కండక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపేందుకు సరిపోయేంత సిబ్బంది లేక, ప్రతి నిత్యం ప్రజల నుంచి ఆర్టీసీ విమర్శలను ఎదుర్కొవాల్సి వస్తున్నది. ఆర్టీసీలో ప్రస్తుతం 2 వేల డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరికొన్ని కండక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో నిత్యం బస్సుల రాకపోకల కోసం సిబ్బందిని సమకూర్చే విషయంలో అధికారులు సతమతం అవుతున్నారు. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సిబ్బంది నియామకాలు చేపట్టాలని సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు డ్రైవర్ కమ్ కండక్టర్ పోస్టుల భర్తీకి ముందుకొచ్చింది. జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే సర్వీసుల్లోనూ డ్రైవర్, కండక్టర్ డ్యూటీ ఒకరే చేసేలా నియామకాలు చేపట్టనున్నట్టు తెలిసింది. డ్రైవర్ ఉద్యోగంలోకి వచ్చే వ్యక్తి కండక్టర్ డ్యూటీ కూడా చేయాల్సి ఉంటుందని ఆర్టీసీ నిబంధనలను రూపొందిస్తున్నది. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నట్టు సమాచారం. ఖర్చు కూడా తగ్గుతుందనే భావనతో ఈ దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిసింది. హైదరాబాద్ నగరంతోపాటు శివారుల్లోని కళాశాలలు, విద్యాసంస్థల సమయపాలన ఒకేలా ఉండేలా మార్చాలని కోరుతూ ఆర్టీసీ లేఖలు రాసింది. వాటికి అనుగుణంగా 1,500 బస్సులను కళాశాలలు, విద్యాసంస్థల సమయాల్లో నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమవుతున్నది.

# గురుకుల పోస్టుల్లో కోర్టు తీర్పు అమలయ్యేనా?

- హైకోర్టు ఆదేశించినా ముందుకు సాగని నియామక ప్రక్రియ
- ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్: ట్రిబ్
- మానసిక ఆవేదనలో అభ్యర్థులు

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టుల భర్తీలో ప్రభుత్వానిదే తుది నిర్ణయమని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకే షన్ ఇన్‌స్టిట్యూషన్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) తేల్చిచెప్పింది. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ లోని అనేక అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్ర యించగా, వారికి అనుకూలంగా న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది. కానీ ట్రిబ్ మాత్రం ఇంకా ఏ నిర్ణయమూ తీసుకో లేదు. కోర్టు ఆర్డర్ కాపీలను పట్టుకొని అభ్య ర్థులు బోర్డు చుట్టూ తిరుగుతుండగా, బోర్డు మాత్రం ప్రభుత్వానికి అన్ని అంశాలను నివేదిం చామని, నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని చేతులెత్తేసింది. దీనిపై అభ్యర్థులు తీవ్ర అస హనం వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు**

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో తొమ్మిది క్యాటగిరీల్లో (పీజీటీ, టీజీటీ, జేఎల్, డీఎల్, పీడీ, లైబ్రేరియన్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్, ఫిజికల్ డైరెక్టర్) మొత్తం 9210 పోస్టుల భర్తీకి ట్రిబ్ చర్యలు చేప ట్టింది. గత ఆగస్టులోనే రాత పరీక్షను నిర్వహిం చగా, ఈ ఫిబ్రవరిలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులు మినహా దాదాపు 8700 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేసిన విషయం తెలిసిందే. అయితే సర్టిఫికెట్ వెరిఫికేషన్, డెమోల నిర్వ హణ, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రిలిక్విష్‌మెంట్ లేకుండా నియామకాలను చేపట్టడంపై అభ్యం తరం వ్యక్తంచేస్తూ కొందరు హైకోర్టును ఆశ్ర యించారు. ప్రధానంగా కామన్ పేపర్‌ను పెట్టి, అవరోహణ క్రమంలో పోస్టుల భర్తీ చేపట్ట కుండా, ఆరోహణ పద్ధతిలో ఒకేసారి అన్ని ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా, ఒక అభ్యర్థి 3 లేదా 4 ఉద్యోగాలకు ఎంపికయ్యారని, అందువల్ల 2000 పోస్టులకు పైగా ఖాళీలు ఏర్పడే పరిస్థితి ఏర్పడిందని కోర్టుకు విన్నవిం చుకున్నారు. గతంలో ఇదే అంశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఉదహరించారు. ఒకరు ఉద్యోగానికి ఎంపికైనవారు ఆ పోస్టులో చేరక పోతే, వాటిని ఆ తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ట్రిబ్ చేపట్టిన విధానం వల్ల వేలాది పోస్టులు బ్యాక్‌లాగ్ ఏర్పడడమే గాక, వేల మంది తీవ్రంగా నష్టపోవాల్సి వస్తు న్నదని అభ్యర్థులు కోర్టు ఎదుట ఆవేదన వ్యక్తం చేసుకున్నారు. దీంతో హైకోర్టు గురుకుల అభ్య ర్థులకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. గురుకుల నియామకాల్లో మి గిలిపోతున్న ఉద్యోగాలన్నిటినీ తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలు వెలు వడి దాదాపు రెండు నెలలు అవుతున్నా ఇప్ప టికీ ట్రిబ్ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

**లైబ్రరీ, జేఎల్ పోస్టుల పరిస్థితీ అంతే..**

ఇతర పోస్టులకు సంబంధించి కూడా ఇదే దుస్థితి నెలకొన్నది. ట్రిబ్ చేపట్టిన జేఎల్ బోటనీ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫి కేషన్‌లో మైక్రోబయాలజీ అభ్యర్థులు అర్హులని ప్రకటించినా డెమోలకు అనుమతించలేదని ఆరోపిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయిం చారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా ట్రిబ్ నియామకాలు చేపట్టిందని ఫిజికల్ డైరె క్టర్ అభ్యర్థులు, అర్హతలేని వారిని ఎంపిక చేశా రని లైబ్రేరియన్ అభ్యర్థులు కూడా కోర్టును ఆశ్రయించారు. జేఎల్ బోటనీ అభ్యర్థులకు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది.

## కొత్త వీసీల నియామకానికి సెర్చ్ కమిటీలు

- కోడ్ ముగిసేలోపు భర్తీకి గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలం గాణ): రాష్ట్రంలోని పది వర్సిటీలకు నూతన వైస్‌చాన్స్‌లర్ల నియామక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. వీసీల నియామకాలకు ముగ్గురు సభ్యులతో కూడి న సెర్చ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈమేరకు విద్యాశాఖ బుధవారం వేర్వేరు జీవోలను జారీచేసింది. యూనివ ర్సిటీ పాలకమండలి, రాష్ట్ర ప్రభుత్వ, యూజీసీ నామినీలతో కూడిన సెర్చ్ కమిటీ లను ఏర్పాటు చేసింది. మూడు, నాలుగు రోజుల్లోనే ఈ కమిటీలు సమావేశం కాను న్నాయి. దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లను గవర్నర్ ఆమోదానికి పంపి స్తాయి. పది వర్సిటీ వీసీ పోస్టులు ఈనెల 21తో ఖాళీకానున్నాయి. అంతలోపే వీసీ లను నియమించాలని ప్రభుత్వం పట్టుద లతో ఉంది. కొత్త వీసీల నియామకానికి అ నుమతివ్వాలని ఈసీని రాష్ట్ర ప్రభుత్వం లిఖి తపూర్వకంగా కోరింది. మంగళవారం ఈసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు విద్యాశాఖ ముఖ్యకా ర్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు.

సీపీగెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వెంకటేశం

##